సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

- పట్టు సాధించేందుకు కూటమి నాయకుల ఆరాటం
- గత పాలన, ప్రస్తుత పాలనపై బేరీజు వేసుకుంటున్న రైతులు


డెల్టా ఆయకట్టుకు నీరందించే గోదావరి కాలువ


సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణనిస్తున్న ట్రైనీ మాస్టర్

భీమడోలు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలోని సాగునీటి సంఘాల వ్యవస్థను మళ్లీ కూటమి సర్కార్ ప్రస్తుతం అమల్లోకి తెచ్చింది. డిసెంబర్‌లో సాగునీటి వినియోగదారుల ఎన్నికలకు ముహూర్తాన్ని ప్రకటించింది. సాగునీటి సంఘాల నిర్వహణలో నీటి సంఘాల పాత్ర ప్రాధాన్యత కలిగింది. చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడంలో ఈ సంఘాల కీలక పాత్రను పోషిస్తాయి. ఇలాంటి ఎన్నికలను అసెంబ్లీ సమావేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఒకసారి వాయిదా వేసింది. అయితే డిసెంబర్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలను నిర్ణయించి తగు ఏర్పాట్లు చేసింది. ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ, సంబంధిత అధికారులు దిశానిర్దేశం చేసారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసారు. డిసెంబర్ 8న మేజర్, మైనర్ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు, 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

రైతులపై పట్టుకోసం ఆరాటం

కూటమి సర్కార్ నాయకులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు పావులు కదుపుతున్నారు. దీనితో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికలు ఏకగ్రీవమయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పదవులను పొందేందుకు నాయకులు రైతులను ప్రసన్నం చేసుకుంటున్నారు. కూటమిసర్కార్ అధికారంలోకివచ్చిన తర్వాత జరుగుతున్న ఈ సాగునీటి సంఘాల ఎన్నికల్లో కీలక పదవుల కోసం అందరూ పోటీ పడుతున్నారు.

అన్నదాత సుఖీభవ పథకం అమలేదీ?

కూటమి సర్కార్ అధికారం కోసం అన్నదాత సుఖీభవ పథకంలో ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చి 5 నెలల గడస్తున్నా నేటికీ రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం సొమ్ము జమ చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి తేదీలు చెప్పి మరీ రైతుల ఖాతాల్లో నగదును నేరుగా జమ చేసిన విషయాన్ని రైతులు చర్చించుకుంటున్నారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుంటున్న రైతులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో తమ ఓటు ద్వారా వారి నిర్ణయాన్ని తెలియజేయనున్నారు.

భీమడోలు మండలంలో 20,528 మంది ఓటర్లు

మండలంలో 13 గ్రామ పంచాయతీ పరిధిలోని 11 మేజర్, మైనర్ సాగునీటి ఎన్నికలకు డిసెంబర్ 5వ తేదీ నాటిని నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఈనెల 8న ఎన్నికలు జరగనున్నాయి. 6మేజర్, 5మైనర్ సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. మైనర్ ఇరిగేషన్, ప్రధానకాలువలద్వారా సొంత భూమి కలిగి సాగునీటితో సాగు చేస్తున్న రైతులంతా ఓటర్లుగా నమోదు కానున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, ఆగడాలలంక, చెట్టున్నపాడు మేజర్ సాగునీటి సంఘాలు కాగా పోలసానిపల్లిలోని యర్రచెరువు, అంబర్‌పేటలోని రెడ్డిగుంట చెరువు, ఎర్ర చెరువులు, దుద్దేపూడిలో మంగలకర్ర, కొత్త చెరువులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఓటర్ల వివరాలు

మైనర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలల్లో పోలసానిపల్లి 162 మంది, అంబర్‌పేటలో 307 మంది, దుద్దేపూడిలో 414 మంది రైతులు తన ఓటు హక్కును వినియోగించుకుంటారు. మేజర్ సాగునీటి సం ఘాలైన పూళ్ల 6,983 మంది, అంబర్‌పేటలో 3,495 మంది, భీమడోలు 3,359 మంది, గుండుగొలనులో 2,055 మంది, ఆగడాలలంకలో 1,525 మంది, చెట్టున్నపాడులో 2,220 మంది రైతులు ఓటును వినియోగించుకున్నారు.

మేజర్ సాగునీటి సంఘానికి 12 సభ్యులు, మైనర్‌కు 6 సభ్యులు

మేజర్ సాగునీటి సంఘానికి 12 మంది సభ్యులను, మైనర్ సాగునీటి సంఘానికి ఆరుగురు సభ్యులు ఎన్నుకుంటారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవం, చేతులెత్తే విధానం, రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. ఎన్నికల్లో పాల్గొనే రైతులు విధిగా నీటి తీరువా చెల్లించాలి. డెల్టా ప్రాంతానికి చెందిన రైతు ఎకరానికి రూ.350, మెట్ట ప్రాంత రైతు ఎకరానికి రూ.100 చెల్లించాలి. లేకుంటే అర్హతను కోల్పోతారు.

అనుభవం గల రైతులు ఎన్నికల్లో పోటీ చేయాలి



సాగునీటి సంఘాల ఎన్నికల్లో అనుభవం గల రైతులను ఎన్నుకుంటే అందరికీ మేలు చేకూరుతుంది. ఎన్నికల నిర్వహించడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది. సాగునీటి సంఘాల వ్యవస్థ బలోపేతానికి ఈ ఎన్నికలు దోహదపడతాయి.

– కిలపర్తి రుక్మాంగధరరావు, కౌలు రైతు, పోలసానిపల్లి

ఎన్నికల నిర్వణకు ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వం సాగునీటి ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. మండలంలోని 11 సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసాం. తహసీల్దార్, జలవనరుల శాఖల అధికారులు పర్యవేక్షిస్తారు. ఇప్పటికే 200 మంది ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించాం.

– కె.లాజర్‌బాబు, ఏఈ, ఇరిగేషన్, ఎన్నికల ఆథరైజ్డ్ అధికారి, భీమడోలు

క్లుప్తంగా

క్షేత్ర పర్యటనలతో జ్ఞాన సముపార్జన

గణపవరం: క్షేత్ర పర్యటనలు విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు దోహదపడతాయని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. శుక్రవారం డిగ్రీ కాలేజి ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కృష్ణా జిల్లా కొల్లేరు ప్రాంతమైన ఆటపాక పక్షుల అభయారణ్యం కేంద్ర సందర్శనకు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ టోర్నీకి మృదుల ఎంపిక

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థిని డాక్టర్ ఈ మృదుల సౌత్ జోన్ మహిళల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో వైద్య విద్యార్థిని మృదులను కళాశాల యాజమాన్యం సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఈనెల 28న డాక్టర్ ఈ త్రిమూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సారథ్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీలో మృదుల ప్రతిభచూపినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు మాట్లాడుతూ మృదుల డిసెంబర్ నెల 20 నుంచి 24వ తేదీ వరకు కేరళలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ కొట్టాయంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. క్రీడాకారిణి మృదుల, ఫిజికల్ డైరెక్టర్ నిట్టా నల్లయను పలువురు అభినందించారు.

సందడిగా వన సమారాధన

భీమడోలు: దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో శుక్రవారం కార్తీక మాసోత్సవంలో భాగంగా కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాలకు చెందిన 122 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేసారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్, సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, పూళ్ల హైస్కూలు హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు, టీచర్లు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ సదస్సు

భీమడోలు: డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సదస్సును ప్రశాంత వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర అధికారులు కోరారు. భీమడోలు ఎంఆర్సీలో శుక్రవారం 4 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలకు రాష్ట్ర ఉన్నతాధికారులతో వెబెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించాలని, విద్యార్థుల ప్రగతి నివేదికలను అందించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలన్నారు. ఎంఈవో 1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ కుమార్ హెచ్‌ఎంలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు పెనుగొండ భువనేశ్వరరావు, అహ్మద్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను ఆహారంగా వేసేందుకు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలంలోని పెదపాడు వైపునకు వ్యానులోకోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పెదపాడు ఎస్సై వాహనాన్ని అదుపులోకి తీసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహన యజమాని, చెరువు యజమానిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వారి సమాచారాన్ని పెదపాడు ఎస్సై ఫోను నంబరు 9440796637 లేదా, 112 నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు.

గంగరాజు మృతదేహం లభ్యం

ఉంగుటూరు: కాలువలో పడి మృతి చెందిన యర్రారపు గంగరాజు (60) మృతదేహం లభ్యమయ్యింది. కోనేరుపేట రేవు సమీపంలోనే మృతదేహం లభ్యమైంది. గంగరాజు మృతదేహానికి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

భీమడోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అభాగ్యులకు చేయూతను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పోలసానిపల్లిలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రెండు కుటుంబాలకు శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించారు. పోలసానిపల్లికి చెందిన పెరవరపు కోటిరత్నం రూ.3వేలు, మోదీన అప్పలాచారి కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందించి వితరణను చాటుకున్నారు. సీతంపేటలో అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన పెరికే వెంకటరత్నం కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. వారికి సాయిరామ్ క్లాత్ షోరూమ్ యాజమాని పున్నం గోపి నూతన వస్త్రాలను అందించారు. జిల్లా ఆడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధర్, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, కోశాధికారి అల్లాడ ప్రసాద్, కమిటి సభ్యులు గోనుకుంట రమణ శంకర్, ప్రతినిధులు గుల్ల అప్పారావు, ఉన్నమట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశ ప్రజలకు రాజ్యాంగం గొప్ప కానుక


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిజ్జువరపు రవి ప్రకాష్

పెదవేగి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనేక ఇబ్బందులను ఎదుర్కొని, శ్రమించి రచించిన రాజ్యాంగం భారత దేశ ప్రజానీకానికి అందించిన గొప్ప కానుక అని జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలో శుక్రవారం దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ తదతరులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగం ఆమోదించి 75 సంవత్సరాలైన సందర్భంగా భారతదేశ ప్రజానీకానికి, బడుగు బలహీన వర్గాల ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 2 ఏళ్ల 11 నెలల 18 రోజులు వ్యవధిలో రాజ్యాంగాన్ని రచించి భారతదేశ ప్రజానీకానికి అందించిన గొప్ప కానుకని పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని రవి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల మహిళా అధ్యక్షురాలు మోనూరి దేవ మాత పెదవేగి మండలం దళిత సేన మహిళ ఉపాధ్యక్షురాలు ముత్యాల ఝాన్సీ లక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తీక పూజలు


గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వరుడు


భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వరుడు


గుండుగొలనులో చామంతులతో పూజ చేస్తున్న మహిళలు

భీమడోలు: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా చివరి శుక్రవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. గుండుగొలను, పూళ్ల, భీమడోలు, అంబర్‌పేట, పోలసానిపల్లిలో స్వయంభువుగా వెలిసిన స్వామి వార్లకు విశేష పూజలు చేసారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో సామూహికంగా స్వామివార్లకు పంచామృత నవరసఫల అభిషేకాలు, మహిళలతో లక్ష్మీ చామంతి పుష్పాలతో పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తొలుత భక్తులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని శివ నామస్మరణ చేసారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో పూజారి కాశీబొట్ల ఉమాశంకర్ శర్మ, పోలసానిపల్లిలో పూజారి ఉండి భాస్కరరావు ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

మహిళలను వేధించడం అనాగరికం

గణపవరం: మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని, మహిళలను వేధించడం అనాగరికమని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. శుక్రవారం డిగ్రీ కాలేజి మహిళా సాధికారక విభాగం, ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, యూజీసీ సంయుక్తంగా నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురాజు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఈ విషయంలో అవగాహన కల్పించాలని కోరారు. మహిళా విభాగం కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ మహిళలపై హింసను వ్యతిరేకిస్తామని, హింసకు పాల్పడమని, సహించమని, హింస నుంచి బయటపడ్డ వారికి అండగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.అక్కిరాజు, శ్రీనివాసరావు, వెంకట్రావు, శారదాదేవి, వెంకటరమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని రద్దు చేయాలి

దెందులూరు : విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎస్‌ఎల్‌డీపీని వెంటనే రద్దు చేయాలని, మినిమం టైం స్కేల్ టీచర్ల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీతంపేటలో ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి గురిచేసి శిక్షణ ఇవ్వకూడదన్నారు. అనేక మంది ఉపాధ్యాయులకు అనారోగ్య సమస్యలున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి అనేకసార్లు ఈ శిక్షణ రద్దు చేయాలని కోరినా స్పందించలేదన్నారు. మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబంలో అర్హత గల వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గంగన్నగూడెంలో గంగానమ్మవారి ఆలయ మూడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వార్షికోత్సవానికి స్థానికులతోపాటు గంగన్నగూడెం, అక్కిరెడ్డిగూడెం, సానిగూడెం, గాలాయిగూడెం, నాగులదేవునిపాడు, దెందులూరు, మొండూరు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి

దెందులూరు: ఇళ్లల్లో ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి చిప్పలు, టైర్లు, సీసాలో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి ప్రాణాంతక వ్యాధులను వ్యాపింపజేస్తాయని దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ అన్నారు. ప్రజలందరూ ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. చలిగాలుల ఉధృతి పెరగడంతో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించి, వైద్య సేవలు పొందాలని డాక్టర్ సుందర్ వివరించారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు: పెనియేలు ప్రార్థన మందిరం సంఘ సభ్యులు, సంఘస్తులు దెందులూరులో బత్తిని సోమరాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తొలుత చిన్నారులు, సంఘస్తులు గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. క్రిస్మస్ కేకులు కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మిషన్ వాత్సల్య పథకంపై శిక్షణ


మిషన్ వాత్సల్య పథకంపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిషోర బాలిక వికాసం-2.0 అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం శుక్రవారం ఉదయం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీఆర్ మనోజ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిషోర బాలిక వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా లింగ వివక్ష, సంపూర్ణ ఆహారం ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణాను అరికట్టడం, బాలికలకు ఆత్మ రక్షణ చర్యలను నేర్పటం, నైపుణ్యం ఉపాధి కల్పన తదితర అంశాలపై, గ్రామాల్లో ఖాళీగా ఉన్న కిషోర్ బాలికలను (11-18 సంవత్సరాలు) గుర్తించి వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో 11 నుంచి 18 సంవత్సరాలున్న కిషోర బాలికలను గుర్తించి వారికి ఇష్టమైన అంశాల్లో శిక్షణను ఉచితంగా ఇప్పించి చదువు కొనసాగించడం కోసం లేదా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తే ఆ వివాహం చేసుకున్న వ్యక్తులతో పాటు ఆ కార్యక్రమం నిర్వహించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఐసీడీఎస్ సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఎంపీడీవో జీఆర్ మనోజ్‌తో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతన్నల బెంబేలు


ఆరబెట్టిన ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతు

గణపవరం: ఆరుగాలం కష్టపడి పండించిన సార్వా పంట చేతికి అందివచ్చే సమయంలో వాతావరణ మార్పులు, తుఫాన్ హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే చాలామంది రైతులు వరికోతలు పూర్తిచేసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. ఈదశలో వాతావరణ మార్పులు రైతుల గుండెల్లో గుబులు రేపుతుంది. వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు సార్వా మాసూళ్లు ముమ్మరం చేశారు. దాదాపు 75శాతం రైతులు వరికోతలు పూర్తిచేసి ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్నారు. కొందరు రైతులు ధాన్యం అమ్మకాలు కూడా పూర్తిచేశారు. ధాన్యంలో తేమ శాతం తగ్గించడానికి వారం రోజులుగా రైతులు ధాన్యాన్ని ఎండ బెట్టుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చలిగాలులు, వర్షం జల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందారు. దీనితో రైతులు ఎండబెట్టిన ధాన్యాన్ని రాశులు చేసి, బస్తాల్లో నింపి నెట్టుకట్టి వర్షం వచ్చినా తడవకుండా ప్లాస్టిక్ బరకాలు, టార్పాలిన్లు కప్పుకున్నారు. మండలంలోని పిప్పర, చిలకంపాడు, కాశిపాడు, వాకపల్లి, వీరేశ్వరపురం, వల్లూరులో సార్వా వరి కోతలు పూర్తికాగా, మిగిలిన చోట్ల ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్కువ మంది రైతులు వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తుండగా, కొందరు రైతులు కూలీలతో కోత కోయిస్తున్నారు. ధాన్యాన్ని రైతులు రోడ్ల మీదికి, సమీప పుంతల్లోకి చేరవేసి ఆరబెట్టుకుంటున్నారు. ఈ సమయంలో తుఫాన్ ప్రభావంతో వాతావరణం మారడంతో శుక్రవారం రైతులు ఎండబెట్టిన ధాన్యాన్ని బరకాలు, టార్పాలిన్‌లు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. రైతులు సార్వా పంట చేతికందిందని సంబరపడుతున్న తరుణంలో తుఫాన్ హెచ్చరికలు వారిని కలవరపెడుతున్నాయి.

ధాన్యం జాగ్రత్త చేసుకోండి


ధాన్యం కల్లాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పంటలను, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త చేసుకోవాలని వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ రైతులకు సూచించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు, ఏపూరులో ధాన్యం కళ్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటే సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని తెలిపారు. వరి కోతలు రెండు రోజులు నిలుపుదల చేయాలని చెప్పారు.

రీచార్జి చేస్తేనే.. విద్యుత్ సరఫరా

- ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల్లో బిగింపు పూర్తి
- త్వరలో గృహాలకు..
- వ్యతిరేకిస్తున్న వినియోగదారులు


విద్యుత్ శాఖ అధికారులు బిగిస్తున్న స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు

దెందులూరు : ఎన్నికల ముందు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్ల (ప్రీ పెయిడ్)ను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై దుష్ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అత్యంత వేగంగా అమలు చేస్తోంది. నియోజకవర్గంలో లక్షకుపైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను ప్రారంభించడంతో ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలతోపాటు గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. పూర్తిగా వందశాతం బిగించిన తరువాత రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. లేకుంటే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసారు. దీంతోపాటు పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు, దుకాణాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు బిగించిన మీటర్లలో ఎలాంటి సిమ్ కార్డును అమర్చలేదు. దశలవారీగా ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లు వాడిన యూనిట్ల శ్లాబుల ప్రకారం వస్తుందని, రేపు రీచార్జి చేసుకోవడం ద్వారా శ్లాబులు ఉంటాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ యూనిట్ రేటు ఎంత ఉంటుందనే సందేహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈనెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15రోజుల వరకు అపరాధ రుసుముతో చెల్లించేందుకు సమయం ఉంటుంది. ప్రీపెయిడ్ బిల్లు విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే సొమ్ము చెల్లించి రీచార్జి చేయాల్సి ఉంటుంది. దీంతో కొంతమేర పేదలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

రోడ్డున పడనున్న మీటర్ రీడర్లు

ప్రీపెయిడ్ మీటరు రీడర్లు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. మీటరు రీడర్లు ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి రీడింగ్ తీసి వినియోగదారులకు విద్యుత్ బిల్లులు అందిస్తున్నారు. దీనికి వారికి ఒక సర్వీసుకు సుమారు రూ.2.50 చెల్లిస్తున్నారు. నెలలో సగం రోజులు మీటరు రీడింగ్‌లు తీసుకుంటూ మిగిలిన రోజులు ఏదో ఒక పనికి వెళ్లి వారు తమ జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రీపెయిడ్ మీటర్ల విధానం అమల్లోకి వస్తే వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారనుంది. వారు ఉపాధిని కోల్పోయి రోడ్డునపడే పరిస్థితి నెలకొంది.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి



గృహావసరాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. బిల్లులు ఇస్తే 15రోజులు గడువు ఉంటుంది. డబ్బులున్నప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజలు బిల్లు చెల్లిస్తారు. ఇప్పుడు ముందే రీచార్జి చేసుకోవాలంటే పేదలకు భారమే. అర్ధరాత్రి రీచార్జి అయిపోతే తెల్లవారే వరకు కరెంటు లేకుండా ఉండాల్సి వస్తుంది. గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును నిలుపుదల చేయాలి.

– కే శ్రీనివాస్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి